క్లుప్తంగా

వైభవంగా లక్ష హనుమాన్ చాలీసా పారాయణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

ధవళేశ్వరం: లక్ష హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం శనివారం స్థానిక జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో రామదాసమ్మ భక్త బృందం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ధవళేశ్వరం వేంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్(శివ) పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు రెండు వేల మంది లక్ష హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె భక్తులతో కలిసి పారాయణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రామదాసమ్మ భక్త బృందం తడాల చక్రవర్తి, మెండా వెంకట్, వేగిశెట్టి కోదండరామారావు, ఉడతా రంగారావు, సత్యం వెంకట రమణ, కామన సత్యనారాయణ, వైవీ సత్యనారాయణ, మెహర్‌కుమార్, నారపురెడ్డి మురళి, మచ్చా ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సోము వీర్రాజు, చిత్రంలో డాక్టర్ శేషుమాధవ్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేంద్ర పథకాలతో రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కృషి జరుగుతున్నట్టు ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. శనివారం స్థానిక ఐసీఏఆర్–జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ(నిర్కా)లో 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన, పప్పు ధాన్య ఆత్మ నిర్భరత' మిషన్ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. ముఖ్యఅతిథి సోము వీర్రాజు మాట్లాడుతూ, రైతులు, వ్యవసాయ భాగస్వాములకు కొత్త పథకాలపై అవగాహన కల్పించడమే కార్యక్రమ ముఖ్యోద్దేశమన్నారు. నిర్కా డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ మాట్లాడుతూ, కొత్త పథకాలు రైతులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, సంస్థాగత మద్దతు, మార్కెట్ లింకేజీలను అందిస్తాయని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, జిల్లా మత్స్య శాఖాధికారి నిర్మలకుమారి, శాస్త్రవేత్తలు, ఎఫ్‌పీవోల సభ్యులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

సారా నేరస్తురాలిపై పీడీ యాక్ట్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నార్త్‌స్టేషన్ పరిధిలో రామదాసుపేటకు చెందిన పొట్నూరి దేవిపై కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పీడీ యాక్ట్ అమలు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. కొంతకాలంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న వ్యక్తులపై నార్త్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ శాఖ అధికారుల సమన్వయంతో కఠిన చర్యలు చేపడుతున్నామన్నారు. రామదాసుపేటకు చెందిన పొట్నూరి దేవి గతంలో కూడా అనేక కేసులలో అరెస్ట్ అయి, తరచూ నేర చర్యలకు పాల్పడుతున్నట్టు గుర్తించామన్నారు. ఇటువంటి వ్యక్తుల వల్ల సమాజంలో చట్ట వ్యవస్థ దెబ్బతినకుండా, ప్రజల ప్రాణభద్రతను కాపాడే ఉద్దేశంతో ఈ చర్య తీసుకున్నట్టు చెప్పారు. అక్రమ మద్యం తయారీ, రవాణాపై ఎక్సైజ్, పోలీసు శాఖల సహకారంతో కఠిన చర్యలు కొనసాగుతాయన్నారు. ప్రజలు కూడా ఇటువంటి కార్యకలాపాలను గమనించిన వెంటనే అధికారులు తెలియజేయాలని కోరారు. అక్రమ మద్యం వల్ల ప్రాణనష్టం, ఆరోగ్య నష్టం జరుగుతుందని, ఇలాంటి కార్యకలాపాల నుంచి దూరంగా ఉండాలని హెచ్చరించారు.

సినిమాలు



శ్యామల:	అరి
సూర్య మినీ:	ట్రాన్
సూర్య ప్యాలెస్:	కాంతారా చాప్టర్–1
స్వామి:	ఓజీ
అనుశ్రీ:	ఓజీ
శివజ్యోతి:	మమ్మీ ఈజ్ బ్యాక్
రాజా:	కాంతారా చాప్టర్–1
ఊర్వశి:	కాంతారా చాప్టర్–1
మేనక:	ఇడ్లీకొట్టు
రంభ:	మిరాయ్
అప్సర:	ట్రాన్
అశోక:	కానిస్టేబుల్, శశివదనే
నామవరం	
వీఎస్ మహల్:	కాంతారా చాప్టర్–1
ధవళేశ్వరం	
మురళీకృష్ణ:	కాంతారా చాప్టర్–1
కడియం	
వెంకటసూర్య:	కాంతారా చాప్టర్–1

మత సామరస్యానికి ప్రతీక

- నేడు హజ్రత్ మహబూబ్ సుభానీ కరీముల్లాషా ఖాదరీ గంధ మహోత్సవం
- 66 ఏళ్లుగా నిర్వహణ
- కులమతాలకు అతీతంగా హాజరు



విద్యుత్ కాంతులతో దర్గా నిషానీ

సీటీఆర్ఐ: మతసామరస్యానికి ప్రతీకగా హజ్రత్ మహబూబ్ సుభానీ కరీముల్లాషా ఖాదరీ గంధ మహోత్సవం నిలుస్తోంది. ముస్లింలతో పాటు, వేర్వేరు మతాలకు చెందిన వారు కూడా శాంతి, సౌభ్రాతృత్వాలకు ఆదర్శంగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న హజ్రత్ మహబూబ్ సుభానీ కరీముల్లాషా ఖాదరీ దర్గా నిషానీలో ఆదివారం 66వ గంధ మహోత్సవం నిర్వహించనున్నారు. 1952లో ఈ దర్గా నిషానీ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతిఏటా వైభవంగా ఈ గంధోత్సవాన్ని దర్గా నిషానీ కమిటీ నిర్వహిస్తూ వస్తోంది. మహాప్రవక్త హజ్రత్ మొహమ్మద్ (సల్లెల్లాహు అలైహి వసల్లం)కు ప్రీతిపాత్రులైన హజ్రత్ మహబూబ్ సుభానీ (గౌస్ ఎ ఆజం దస్తగీర్) దర్గా ఇరాక్‌లో ఉంది. దాదాపు ఎనిమిది శతాబ్దాల క్రితం ఇస్లాం ధర్మ పరిరక్షణలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఆయన దర్గా నుంచి జెండా నిషానీ తీసుకొచ్చి రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద స్థాపించారు. అప్పటి నుంచి ఇరాక్‌లోని ఆయన దర్గాలో ఎలాంటి కార్యక్రమాలు జరుగుతాయో.. ఇక్కడా అలాగే నిర్వహిస్తున్నారు.

సంప్రదాయబద్ధంగా..

గంధోత్సవం రోజు సంప్రదాయబద్ధంగా దర్గా నిషానీపై ఎక్కించే గంధాన్ని నగరంలో పలుచోట్ల ఊరేగిస్తారు. ఒంటెలు, ఫకీరు మేళాలు, గుర్రాలతో ఈ ఊరేగింపు కొనసాగుతుంది. నగరంలోని నెహ్రూనగర్, రాజేంద్రనగర్, వైజంక్షన్ తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ఊరేగింపు దర్గా నిషానీ వద్దకు చేరుకుంటుంది. జెండాలతో కుల మతాలకు అతీతంగా భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొనడం విశేషం. అంతేకాకుండా దర్గా నిషానీపై ఎక్కించాక మిగిలిన గంధాన్ని తీసుకునేందుకు ప్రాధాన్యమిస్తారు. ఈ సందర్భంగా భోజన ఏర్పాట్లు కూడా చేశారు. సుమారు పది వేల మంది పాల్గొంటారని అంచనా.

వివిధ వర్గాలవారు హాజరు



నా ఏడో ఏట నుంచి ఈ దర్గా నిషానీ గంధోత్సవం జరుగుతుంది. అంతక్రితం మా అమ్మ ఈ గంధోత్సవాన్ని నిర్వహించేవారు. ఆమె తరువాత నేను ఆ బాధ్యత తీసుకున్నాను. ఈ ఉత్సవంలో ముస్లింలు ఒక్కరే కాకుండా, వివిధ వర్గాల వారు పాల్గొని బాబా ఆశీస్సులు పొందుతారు.

– సయ్యద్ హజర్నీ అమీరున్నీసా, దర్గా నిషానీ

వైభవంగా నిర్వహిస్తాం



ఈ ఉత్సవాన్ని ప్రతి ఏటా వైభవంగా నిర్వహిస్తాం. ఒంటెలు, గుర్రాలు, ఫకీర్ల మేళాలతో గంధానికి నగరంలో ఊరేగింపు నిర్వహించి, మరలా దర్గా వద్దకు తీసుకొస్తాం. అనేక మంది ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాన్య ప్రజలు, వివిధ వర్గాలవారు ఈ గంధం తీసుకోవడం వరంగా భావిస్తారు.

– సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, అధ్యక్షుడు, దర్గా నిషానీ

జక్కంపూడి రాజాకు పేపరు మిల్లు కార్మికుల కృతజ్ఞతలు



జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న పేపరుమిల్లు కార్మికులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నూతన అగ్రిమెంట్ జరిగి ఇటీవల కార్మికుల వేతనాలు పెరిగిన నేపథ్యంలో పేపరుమిల్లు యూనియన్ నాయకులు, కార్మికులు వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని జక్కంపూడి నివాసంలో పేపరుమిల్లు కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాలు జరిపిన పోరాటానికి మద్దతుగా నిలిచినందుకు జక్కంపూడి రాజాను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. దాదాపు నాలుగు వేల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరిందని, మంచి అగ్రిమెంటు జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు జక్కంపూడి రాజా స్వీట్లు తినిపించి ఆనందం పంచుకున్నారు. కార్యక్రమంలో పేపర్‌మిల్ యూనియన్ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రకాశం నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్, ఉషూ క్రీడా పోటీలు రెండో రోజైన శనివారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ప్రారంభించారు. అండర్–14, 17 బాలురు, బాలికల విభాగంలో బాక్సింగ్ పోటీలు, అండర్–17 బాలురు, బాలికల విభాగంలో ఉషూ పోటీలు జరిగాయి. సుమారు 13 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం ఫైనల్స్ మ్యాచ్‌లు జరుగుతాయని, అదే రోజు సాయంత్రం విజేతలకు బహుమతీ ప్రదానం ఉంటుందని డీఈఓ తెలిపారు.

హైకోర్టు అడిషనల్ జడ్జి నర్సరీ సందర్శన

కడియం: కడియపులంకలోని శ్రీసత్యదేవా నర్సరీని శనివారం హైకోర్టు అడిషనల్ జడ్జి సుమతి జగడం సందర్శించారు. ఆమెకు నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు ఆగ్లోనిమా మొక్కతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ, నర్సరీ పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉందని, మొక్కలను పెంచే విధానం బాగుందని చెప్పారు. ఇంకా విదేశాలకు కూడా ఎక్కువ మొక్కలను ఎగుమతి చేస్తే బాగుంటుందన్నారు. నర్సరీ ప్రతినిధులు పుల్లా చినసత్యనారాయణ, పుల్లా పెద్దసత్యనారాయణ ఉన్నారు.

ఆత్మ విశ్వాసంతో బాలికలు ముందుకు సాగాలి

- మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి



సీఐ మంగాదేవిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కంబాలచెరువు: సమాజంలో బాలికలు ధైర్యంగా, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీదేవి హాజరై, బాలికల హక్కులు, విద్యా భద్రత, స్వయం సమృద్ధిపై వివరించారు. ఆరోగ్యం పట్ల మహిళలు మరింత శ్రద్ధ వహించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ, అంతర్జాతీయ బాలిక దినోత్సవం కేవలం వేడుక కాదని, అది బాలికా సాధికారతకు సంకేతమన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, సమాజం బాలికలను గౌరవించి వారికి సమాన అవకాశాలు కల్పిస్తే భవిష్యత్తు మరింత ప్రకాశమవుతుందన్నారు. బాలికలను శక్తిమంతం చేయడమంటే కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని, పటిష్టం చేయడమేనన్నారు. ప్రతి తల్లీతండ్రీ తమ కుమార్తెకు విద్య స్వేచ్ఛ, ఆత్మ విశ్వాసాన్ని ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలపై అమ్మాయిలు మరింత జాగ్రత్తగా ఉండాలని మహిళా స్టేషన్ సీఐ మంగాదేవి సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామ్‌మూర్తి, మహిళా సాధికారత విభాగ సమన్వయకర్త డాక్టర్ పి.సురేఖ, బి.దుర్గాలక్ష్మి, జి.సుభాషిణి, డాక్టర్ కె.అనూష, పద్మ, ఇతర మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

హ్యుందాయ్ అల్వామ్స్ అరౌండ్ సర్వీసు క్యాంప్ నేడు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ రాజమండ్రికి చెందిన లక్ష్మి హ్యుందాయ్ సంయుక్తంగా ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు «హ్యుందాయ్ అల్వామ్స్ అరౌండ్» అతి పెద్ద సర్వీస్ క్యాంప్ నిర్వహిస్తుంది. స్థానిక జేఎన్ రోడ్డులోని ఐరన్‌హిల్ పక్కన ఈ క్యాంపు జరుగుతుంది. ఈ క్యాంపును ప్రముఖ తత్వవేత్త మతల రమేష్ ప్రారంభిస్తారు. బ్రహ్మాండమైన ఆఫర్లతో సర్వీస్, సేల్స్ హ్యుందాయ్ ప్రామిస్ మీద డిస్కౌంట్లు ఉన్నాయని లక్ష్మి హ్యుందాయ్ డీజీఎం సునీల్ ఓ ప్రకటనలో తెలిపారు. సర్వీసు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్వానంగా కార్తికేయనగర్

- రోడ్డుపైనే మురుగు నీరు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- రేయింబవళ్లు దోమల దండయాత్ర
- ఫిర్యాదు చేసినా అధికారుల చర్యలు శూన్యం



కార్తికేయనగర్‌లో మురుగు కాలువగా మారిన రోడ్డు



హుకుంపేట జాతీయ రహదారి నుంచి కార్తికేయనగర్‌కు వచ్చే రోడ్డు దుస్థితి

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట పంచాయతీ పరిధిలోని కార్తికేయనగర్‌వాసులు దుర్గంధం, దోమల దండయాత్రతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రోడ్డు మురుగు కాలువగా మారింది. రాకపోకలకు ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వయంగా జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో పలు దఫాలు ఫిర్యాదు చేసినప్పటికీ, సమస్యలు పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హుకుంపేట జాతీయ రహదారికి దగ్గరగా ఉండడంతో ఉద్యోగులు, ఇతర వర్గాల వారు కార్తికేయనగర్‌లో స్థలాలు కొని, ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారు. ఇంటి పన్నులు సైతం సకాలంలో చెల్లించే కార్తికేయనగర్ వాసులకు మాత్రం సమస్యలు తప్పడం లేదు. వీటిని పరిష్కరించడంలో అధికారులూ చొరవ చూపడం లేదు. జాతీయ రహదారిపై కల్వర్టు ఎత్తుగా ఉండడం వలన డ్రైనేజీలలో మురుగునీరు ముందుకు పారకపోవడంతో రోడ్డుపైకి వచ్చి చేరి మురుగు కాలువగా మారింది. మరోవైపు డ్రైనేజీ పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో ఆ మురుగు నీరు వెనక్కు తన్ని పైపుల కంపెనీకి చెందిన పొలంలోకి చేరుతుంది. డ్రైనేజీలలో మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండడంతో దోమల ఉధృతి పెరిగి రేయింబవళ్లని తేడా లేకుండా దండయాత్ర చేస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతవాసులకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది.

మురుగులోనే ప్రయాణం

రోడ్డు మురుగు కాలువగా మారడంతో ఈ రోడ్డులో కార్తికేయనగర్, జనచైతన్య లేఅవుట్, వరలక్ష్మీకాలనీ ప్రాంత వాసులంతా హైవేపైకి ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. పిల్లలు, పెద్దలు ఈ మురుగు నీటిలో ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్కసారి వాహనాలు నిలిచిపోతే వారి పరిస్థితి వర్ణనాతీతమే. ఈ మురుగునీటిలో వెళ్లడం వలన ఏ రోగాలు వస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా..

స్వయంగా జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో కార్తికేయనగర్ వాసులు దఫదఫాలుగా ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదంటున్నారు. అధికారులు వస్తున్నారు.. చూస్తున్నారే తప్ప సమస్య అలాగే ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్తికేయనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థతో పాటు, రోడ్డుపై మురుగునీరు రాకుండా చూడాలని ఆ ప్రాంతవాసులు వేడుకుంటున్నారు.

ప్రజలతో మమేకం కావాలి

- వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్



డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కార్యకర్తలు

సీటీఆర్ఐ: ప్రజాపక్ష పోరాటాలతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు నిత్యం ప్రజలతో మమేకం కావాలని పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ నిర్దేశించారు. రానున్నది జగనన్న కార్యకర్తల ప్రభుత్వమని, కార్యకర్తలకు జగనన్న అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. శనివారం పలువురు కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీపై అభిమానమున్న యువత జగనన్నకు బాసటగా నిలవాలని, మళ్లీ జగనన్నను సీఎం చేసేందుకు అవిశ్రాంత కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సంస్థాగత పటిష్టతలో భాగంగా ప్రతి కార్యకర్తకు బీమా కల్పించి, గుర్తింపు కార్డు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసి జగనన్నకు, పార్టీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో యువ నాయకులు పాడి నాగేంద్రబాబు, కొవ్వూరు మండల సోషల్ మీడియా కన్వీనర్ చరణ్, నానిబాబు, సీహెచ్ రాజశేఖర్, బి.కిరణ్, కె.అనిల్, బి.హరీష్ తదితరులున్నారు.

వృద్ధుల సేవే మానవతా ధర్మం

- దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్



ఉత్తమ సీనియర్ సిటిజన్ పురస్కార గ్రహీతలు వీరే..

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): వృద్ధులు చూపిన మార్గమే సమాజాభివృద్ధికి ఆధారమని, వృద్ధుల సేవే మానవతా ధర్మమని దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్ అన్నారు. శనివారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ప్రాంగణంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విభిన్న రంగాల్లో విశేష సేవలు అందించిన వయోవృద్ధులకు బెస్ట్ సీనియర్ సిటిజన్ అవార్డులను శ్రీనివాస్ ప్రదానం చేశారు. కేవీ చలపతిరావు(విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్, టెలికం), కొల్లి భాగ్యలక్ష్మి (నిర్వాహకురాలు, ఆలంబన సమస్త), మేడపాటి ధర్మారెడ్డి (డైరెక్టర్, సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్), చల్లా రాజేశ్వరి (విశ్రాంత రైల్వే ఉద్యోగి), బొప్పన నాగేశ్వరరావు (ఉపాధ్యక్షుడు, స్వర్ణాంధ్ర), నయనాల కృష్ణారావు (నిర్వాహకుడు, పూలే సామాజిక చైతన్య వేదిక), జిల్లా ఉత్తమ వృద్ధాశ్రమ నిర్వహణ విభాగంలో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, వృద్ధుల సంరక్షణ చట్టం ద్వారా వారి హక్కులను కాపాడటానికి అనేక మార్గదర్శకాలు రూపొందించబడ్డాయన్నారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి ఆర్డీవో స్థాయి అధికారులతో ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశారన్నారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల సమస్యల పరిష్కారానికి తమ శాఖ నిరంతర కృషి చేస్తుందన్నారు. వృద్ధులు సమాజానికి, జ్ఞానానికి ప్రతీకలని, అనుభవానికి నిలయాలన్నారు. వారి సేవలను గౌరవించడం, వారికి ఆప్యాయత చూపడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకులు బి.సత్యనారాయణరాజు, స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ వి.రాజు, సీనియర్ సిటిజన్స్ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

శిథిల స్తంభాలతో పొంచి ఉన్న ముప్పు



జేగురుపాడులో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం



అపాయకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కడియం: విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ కోరారు. జేగురుపాడు పంచాయతీ కార్యాలయం పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కొత్త విద్యుత్ స్తంభం వేయాలని, సమీపంలో మరో స్తంభానికి రక్షణ లేని స్విచ్‌లను తొలగించి బాక్స్‌లు ఏర్పాటు చేయాలంటూ కడియం సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజినీర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ వద్ద ఎలక్ట్రికల్ సిమెంట్ స్తంభం శిథిలమై ఒరిగిపోయిందన్నారు. రక్షణ చర్యలు లేని ఫీజులు చిన్న పిల్లలకు అందేలా వైర్లు వేలాడుతున్నాయని చెప్పారు. సచివాలయానికి వస్తున్న ప్రజలు ఆయా స్తంభాలను దాటుకుని రావాల్సి ఉందన్నారు. వర్షం పడితే మంటలు వస్తూండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. చాలా కాలం నుంచి ఇదే పరిస్థితి ఉన్నా, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు. ఇక్కడ ఏవిధమైన ప్రమాదం జరిగినా, ప్రాణనష్టం వాటిల్లినా విద్యుత్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఆటో డ్రైవర్లకు ఇబ్బంది లేదు

రాజమహేంద్రవరం రూరల్: ఉచిత బస్సు వల్ల ఆటో డ్రైవర్లకు ఇబ్బంది లేదని, మారుమూల ఇరుకు ప్రాంతాలకు వెళ్లాలంటే ఆటోలు కావాల్సిందేనని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి వ్యాఖ్యానించారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున అందజేయడంతో పాటు, వారిపై ఎలాంటి కేసులు, పెనాల్టీలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మెడికల్ కాలేజీల విషయంలో పీపీపీ విధానం తప్పని, దీనిని అడ్డుకుంటామని అనడం తగదన్నారు.

గ్యాస్ లీకేజీతో ఇల్లు దగ్ధం



ప్రమాదంలో దగ్ధమవుతున్న ఇల్లు

కడియం: వంటగ్యాస్ లీకేజీ కారణంగా కడియంలో గిరజాల కృష్ణప్రసాద్ కల్యాణ మంటపం వెనుక పెద్ద చెరువు గట్టుపై శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, చెరువు గట్టుపై వృద్ధురాలు నివసిస్తున్న ఇంట్లో వంటగ్యాస్ లీకేజీ కావడంతో మంటలు చెలరేగాయి. ఇల్లు క్షణాల్లో కాలి బూడిదైంది. స్థానికుల సమాచారంతో రాజమండ్రి అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్ (నాని) ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆస్తి నష్టం తెలియాల్సి ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడ నుంచి రావులపాలేనికి వ్యాన్‌లో తరలిస్తున్న 3,135 కిలోల రేషన్ బియ్యాన్ని శనివారం లాలాచెరువు పోలీస్ శిక్షణా కేంద్రం వద్ద రూరల్ ఎంఎస్‌వో కె.సూర్యప్రభాకర్, పోలీసులు పట్టుకున్నారు. విజయవాడ నుంచి పీడీఎస్ బియ్యాన్ని వ్యాన్‌లో దివాన్‌చెరువు జీరో పాయింట్ నుంచి రావులపాలేనికి తరలిస్తున్నారు. పీడీఎస్ బియ్యాన్ని గాడాలలోని సప్తగిరి రైసుమిల్లులో అప్పగించి, వ్యాన్ డ్రైవర్ కె.మణికంఠ, క్లీనర్ బి.సతీష్‌ను అదుపులోకి తీసుకుని, వ్యాన్‌ను బొమ్మూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎంఎస్‌వో కె.సూర్యప్రభాకర్ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై కొమరపు రమేష్ కేసు నమోదు చేశారు.

బాలికలకు మెరుగైన భవిష్యత్తు నిర్మించాలి



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

రంగంపేట: సమాజంలో బాలికల కోసం మెరుగైన భవిష్యత్తు నిర్మించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పీహెచ్‌సీలో బాలికను రక్షించండి–భవిష్యత్తును కాపాడండి అనే నినాదంతో సేవ్ గర్ల్ చైల్డ్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలికలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, హింస, అసమానతలపై అవగాహన కల్పించారు. విద్య, పోషణ, భద్రత, ఆరోగ్య సంరక్షణ, చట్టపరమైన హక్కులు, సాధికారత వంటి అంశాల్లో బాలికలకు మెరుగైన అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో వి.తులసీదాస్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.